ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.21 (సోమ)
సహరి : 4.47 (మంగళ)

వేసవిలో మంచినీటి కొరత రానివ్వం..



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- జిల్లాలో మెరుగుపడుతున్న పారిశుధ్యం.. శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్
- ఆర్థిక సంఘ నిధులతో పంచాయతీలు బలోపేతం
- నెలాఖరు నాటికి పంచాయతీల్లో నూరుశాతం పన్నుల వసూలు
- జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ

(ఏలూరు సిటీ- ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పాలన గాడిలో పడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక సంఘ నిధులను పంచాయతీలకు నేరుగా కేటాయిస్తుండడంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశం ఏర్పడింది. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ వివిధ అంశాలపై జిల్లాలో చేపట్టిన పనులను వివరించారు. ఆమె మాటల్లోనే..

■ జిల్లాలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తు న్నాం. ఇంటింటికీ చెత్త సేకరణ నిరంతరం కొనసాగేలా పంచాయ తీలకు ఆదేశాలిచ్చాం. తడిచెత్త, పొడిచెత్తను ఏ విధంగా వేరు చేయాలో తెలుపుతూ వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు చేశాం.

■ పంచాయతీల్లో ఆస్తుల గుర్తింపుపై సర్వే

పంచాయతీల ఆస్తులను గుర్తించడానికి సర్వే నిర్వహిస్తున్నాం. ఈ సర్వేలో పంచాయతీ స్థలాలు ఆక్రమ ణలకు గురైనట్టు తేలితే వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుని ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుంటాం. అక్రమ లేఅవుట్ల విషయంలోను పరిశీలన చేసి అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకుంటాం.

■ ఆర్థిక సంఘ నిధులతో బలోపేతం

కూటమి ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధులను విడుదల చేస్తోంది. వీటితో గ్రామాల్లో మంచి నీటి సరఫరా, పారిశుధ్యంతో పాటు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వినియోగిస్తున్నారు.

■ నెలాఖరు నాటికి కార్యదర్శుల పోస్టుల భర్తీ

జిల్లాలో 547 పంచాయతీలున్నాయి. వీటిలో 497 పంచాయతీలకు సంబంధించి గ్రామ కార్యదర్శులు న్నారు. మిగిలిన 50 పంచాయతీల్లో కార్యదర్శులు లేరు. ఆ పోస్టులను ఈ నెలాఖరు లోగా భర్తీ అయ్యే అవకాశం ఉంది.

■ వేసవిలో సక్రమంగా మంచినీటి సరఫరా

అన్ని పంచాయతీల్లో వేసవిలో సక్రమంగా మంచినీటి సరఫరా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకుంటు న్నాం. మంచినీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నాం. చెరువుల్లో కాల్వల నీటిని నింపే కార్యక్రమం కొనసాగుతోంది.

■ గ్రామాల్లో అభివృద్ధి పనులు

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పంచాయతీల్లో సీసీ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఫుంత రహదారులు, డ్రెయిన్లు, సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల షెడ్లు, శ్మశానవాటికలు వంటి వాటితో పాటు ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గ్రామాల్లో మహిళలకు అవసరమైన అభివృద్ధి పనులను పంచాయతీ ప్రణాళికలో చేర్చి వాటికి నిధులు కేటాయిస్తున్నారు.

■ డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు

పంచాయతీల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాం. పలు పంచాయతీల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం.

■ 15 పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం

జిల్లాలో 15 పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికే 13 పంచాయతీల్లో విచారణ జరిపి బాధ్యులైన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకున్నాం. అక్కడ పనిచేసిన ప్రత్యేక అధికారులపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. మిగిలిన రెండు పంచాయతీల్లో విచారణ జరుగుతోంది. అయా పంచాయతీల్లో సర్పంచ్‌లకు చెక్‌పవర్ రద్దు చేశాం.

■ 63 శాతం ఇంటి పన్నుల వసూలు

జిల్లాలోని పంచాయతీల్లో ఇంటి, కుళాయి, ఇతర పన్నుల వసూలు వేగవంతంగా జరుగుతోంది. ఇప్పటికే 63 శాతం ఇంటి పన్నుల వసూళ్లు జరిగాయి. ఈ నెలాఖరు నాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయడానికి కార్యాచరణ రూపొందించాం. పంచాయతీల వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తప్పవు.

విజయోస్తు..

నేటి నుంచి రెగ్యులర్, 'ఓపెన్' టెన్త్ పరీక్షలు





- 25,179 మంది విద్యార్థులు.. 133 కేంద్రాల్లో నిర్వహణ
- సహేతుక కారణం చూపితే 'అరగంట' గ్రేస్ పీరియడ్
- ప్రతి ప్రశ్నపత్రానికి క్యూఆర్ కోడ్
- సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా కొనసాగింపు
- ఫేక్‌కాల్స్ చేస్తే క్రిమినల్ చర్యలే..
- సందేహాల నివృత్తికి డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్
- ఏర్పాట్లపై టెన్త్ పరీక్షల జిల్లా పరిశీలకుడి సమీక్ష

ఏలూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి జరగనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్షేత్రస్థాయిలో పరీక్షలు సజావుగా జరిగేందుకు వీలుగా విద్యాశాఖ, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయం చేసుకున్నాయి. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఉక్కపోత, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతకర వాతావరణంలో పరీక్షలు రాసేందుకు వీలుగా సంబంధిత మండలాల ఎంఈవోలు, కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, వీరంతా ఆదివారం ఉదయమే ఆయా పరీక్ష కేంద్రాలకు తరలివెళ్లి ఏర్పాట్లను మరోదఫా పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీవోలతో ఆదివారం సాయంత్రం టెలీకాన్ఫరెన్సు నిర్వహించిన 'పది' పరీక్షల జిల్లా పరిశీలకుడు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి పలు సూచనలు చేశారు. మరోవైపు కలెక్టర్ వెట్రిసెల్వి పదోతరగతి పరీక్షార్థులకు 'ఆల్ ది బెస్ట్' అంటూ శుభాకాంక్షలు చెప్పారు. జిల్లాలో టెన్త్ పరీక్షలకు పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరవుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మొత్తం 25,179 మంది ఉండగా, దూరవిద్య (ఓపెన్ స్కూల్స్) విధానంలో దరఖాస్తు చేసుకున్న బాలబాలికలు 793 మంది ఉన్నారు. జిల్లాలోని 133 కేంద్రాల్లో జరిగే ఎస్ఎస్‌సీ పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. సహేతుక కారణాలతో సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోలేకపోయిన విద్యార్థుల కోసం 'అరగంట' గ్రేస్ పీరియడ్‌ను నిర్దేశించారు. అయితే ఈ వెసులుబాటును నిత్యం వినియోగించుకునే వారిపై నిఘా ఉంచుతారు. సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన కైకరం, రంగాపురం, లక్కవరం, కోరుకొల్లు, టి.నరసాపురం జడ్పీ హైస్కూళ్లు, జీలుగుమిల్లి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చడంతో పాటు, వాటిని కేంద్రీకృత వ్యవస్థ ద్వారా నిఘా బృందాలతో తనిఖీ చేస్తుంటారు. ఎక్కడా లీకేజీలు లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రతీ ప్రశ్నపత్రానికి ఒక క్యూఆర్ కోడ్‌ను ఇచ్చారు. ప్రశ్నపత్రం ఎక్కడైనా లీకైతే ఈ కోడ్‌తో సంబంధిత లీకేజీ ఏ పరీక్ష కేంద్రం నుంచి జరిగిందో వెంటనే తెలిసిపోతుంది. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమల్లో ఉంచాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలను విద్యాశాఖ కోరింది. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల రాకపోకల సమయాలను రీషెడ్యూల్ చేశారు. పరీక్షల్లో అక్రమాలు రుజువైతే బాధ్యులపై మూడు నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.5వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని విద్యాశాఖ హెచ్చరించింది. పరీక్షల నిర్వహణలో ఎవరైనా ఫేక్ కాల్స్ చేస్తే పోలీసులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. పరీక్షలకు సంబంధించి సమస్యలు, సందేహాలుంటే డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 84669 74001లో సంప్రదించవచ్చు. కాగా 'పది' పరీక్షల జిల్లా పరిశీలకుడు కృష్ణారెడ్డి, డీఈవో వెంకటలక్ష్మమ్మ ఏలూరులోని సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలించారు.



'గత అనుభవాన్ని' మర్చిపోవద్దు

జిల్లా పరిశీలకుడు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

గతంలో పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీతో విద్యార్థులతో సహా, ఉపాధ్యాయులపైనా తీసుకున్న చర్యలను తాజా పరీక్షల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఎవరూ మరువరాదని జిల్లా పరిశీలకునిగా నియమితులైన ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఏలూరులోని సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో టెన్త్ పరీక్షలకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, డిప్యూటీ తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, రూట్ ఆఫీసర్లుగా నియమితులైన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. జిల్లాలో ఏలూరు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, వేలేరుపాడులలో మాస్‌కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్, ప్రశ్నపత్రం లీకేజీలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రహరీలులేని 34 'సీ' సెంటర్లలో అదనంగా ఒక ఇన్విజిలేటర్‌ను నియమించుకుని పోలీసు సిబ్బందితో కాంపౌండ్ వాల్స్ వెంబడి నిఘా తిరగాలని ఆదేశించారు. గతంలో జరిగిన టెన్త్ పరీక్షల్లో 30 మంది ఉపాధ్యాయులపై లీకేజీ ఆరోపణలు వచ్చిన విషయాన్ని మరువద్దని, ఆ మేరకు పరీక్షలు పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటన జరిగితే సంబంధిత పరీక్ష కేంద్రం సీఎస్, డీవోలనే బాధ్యులుగా చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్‌కోడ్ ప్రకారమే జవాబు పత్రాలను సంబంధిత విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ఇన్విజిలేటర్లకు లాటరీ పద్ధతిలో రూమ్‌లను కేటాయించాలని ఆదేశించారు. పరీక్షార్థులు స్కూలు యూనిఫాంతో రావద్దని, సివిల్ డ్రస్‌లో మాత్రమే హాజరుకావాలని సూచించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

ఏలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ వెట్రిసెల్వి కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి కలెక్టర్, జేసీ ధాత్రిరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం మరువలేనిదన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్.పుష్పలత, సెట్వెల్ సీఈవో కె.ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, డీపీఆర్వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు, పలువురు అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి ..

రోజురోజుకు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి జిల్లా ప్రజలకు సూచించారు. ఎండ తీవ్రత వడగాల్పులు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. తలపై టోపీ లేదా రుమాలు కట్టుకుని, కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. తరచుగా నీటిని తాగాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోస్, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. శరీరాన్ని డీహైడ్రేడ్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ మానుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఇమామ్, మౌజన్‌లు వివరాలను సమర్పించాలి

ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందుతున్న ఇమామ్, మౌజన్‌లు వారి పూర్తి వివరాలను ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో సమర్పించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కె.మహ్మద్ ఆలీ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆదేశాల మేరకు ఇమామ్, మౌజన్‌లు ఆ మసీదులో ఇమామత్ చేసే వారు ప్రస్తుతం ఉన్న ముతవల్లి లేదా ప్రెసిడెంట్ వారి ఆధార్ జిరాక్సు-2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు, మసీదు పేరున ఉన్న బ్యాంకు అకౌంట్ జిరాక్సులను తీసుకొచ్చి దరఖాస్తు తీసుకుని పూర్తి చేసి ఇవ్వాలని కోరారు.



సన్‌డే..

ఉమ్మడి పశ్చిమలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

నేడు వేడిగాలులపై హెచ్చరికలు

ఏలూరుసిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం రోజున పగటి ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరాయి. ఎండలతో ప్రజలు విలవిలలాడారు. ముఖ్యంగా ఉమ్మడి పశ్చిమలోని జంగారెడ్డిగూడెం, పోలవరంలో అత్యధికంగా 43 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు కాగా జిల్లాలోని ఏలూరు, చింతలపూడి, తాడేపల్లిగూడెం, భీమవరం, కొవ్వూరు, నిడదవోలు, నరసాపురం ప్రాంతాల్లో 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో 40 నుంచి 37 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఇప్పటికే జిల్లాలో వారంరోజులుగా వేసవి వేడిగాలుల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. ఉష్ణోగ్రతల తీవ్రతతో పగటి పూట రహదారులపై ప్రయాణించడం కష్టతరంగా తయారైంది. ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు.

వేడిగాలులపై ముందస్తు హెచ్చరికలు

ఉమ్మడి పశ్చిమలో ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 16న పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆరు మండలాలు, ఏలూరు జిల్లాలోని 16 మండలాల్లో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించినట్టుగానే ఆదివారం వేసవి వేడిగాలుల తీవ్రత కొనసాగింది.17న పశ్చిమగోదావరిలోని మూడు మండలాలు, ఏలూరు జిల్లాలోని 14 మండలాల్లో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లి, భీమడోలు, బుట్టాయిగూడెం, ద్వారకా తిరుమల, ఏలూరు, గణపవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, నిడమర్రు, పెదవేగి, పోలవరం, టి.నరసాపురం, ఉంగుటూరు, వేలేరుపాడు మండలాల్లోను, పశ్చిమగోదావరి జిల్లాలోని పెంటపాడు, తాడేపల్లిగూడెం, తణుకు మండలాల్లో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

ఆదివారం ఉమ్మడి పశ్చిమలో ఉష్ణోగ్రతలు

నగరం/ పట్టణం	ఉష్ణోగ్రత (పగటి/రాత్రి) సెంటీగ్రేడ్‌లో
ఏలూరు	42/20
జంగారెడ్డిగూడెం	43/19
చింతలపూడి	42/20
పోలవరం	43/19
తాడేపల్లిగూడెం	42/20
భీమవరం	42/20
నరసాపురం	42/20
కొవ్వూరు	42/20
నిడదవోలు	42/20
కొయ్యలగూడెం	40/19
తణుకు	40/21
ఆకివీడు	40/21
పాలకొల్లు	37/22

మురుగు వదిలినట్టే!



- ఏలూరు నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి మోక్షం
- రూ.112 కోట్లతో డీపీఆర్
- అనుమతి రాగానే పనులు ప్రారంభం

ఏలూరు టూటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : డ్రెయినేజీ సమస్య నగర ప్రజలను పట్టిపీడిస్తోంది. డ్రెయినేజీ వ్యవస్థ ఏళ్ల తరబడి అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు తిష్ట వేయడంతో నగర ప్రజలు దుర్వాసనతో సతమతమవుతున్నారు. ఏలూరు మునిసిపాలిటీగా ఏర్పడి 160 ఏళ్లకు పైబడినా, కార్పొరేషన్‌గా మారినా ఇప్పటి వరకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ లేకపోవడం గమనార్హం. ఎప్పుడో వందేళ్ల క్రితం వన్‌టౌన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించారు. అది నిర్వహణ సరిగా లేక మొత్తం పూడుకుపోయింది. దశాబ్దాల తరబడి నగర ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం రూ.112 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించడానికి డీపీఆర్ తయారు చేసి పారిశుధ్య విభాగం ఇంజనీరింగ్ చీఫ్‌కు టెక్నికల్ అనుమతికి పంపారు. అనుమతులు రాగానే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి మోక్షం లభించనుంది. కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులు మంజూరయ్యాయి. దీనిలో కేంద్ర ప్రభుత్వం 50 శాతం, నగర పాలక సంస్థ 30 శాతం, రాష్ట్రప్రభుత్వం 20 శాతం నిధులు సమకూర్చనుంది. వన్‌టౌన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి 37 కిలోమీటర్ల మేరా కొత్త పైపులైన్లు వేయనున్నారు. పోణంగి వద్ద 15 ఎంఎల్‌డీ కెపాసిటీతో మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. 37 కిలోమీటర్ల పైప్‌లైన్ల ఎస్‌టీపీకి అనుసంధానం చేస్తారు. సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వచ్చే మురుగు వ్యర్థాలన్నిటిని శుద్ధి చేసిన నీళ్లను కాల్వల్లోకి వదిలి సాగునీరుగా ఉపయోగిస్తారు. దీనిలో భాగంగా ఆరు వేల ఇళ్లకు కనెక్షన్లు ఇస్తారు. పాత పైపులైన్లు, బ్లాక్ అయిన పైపులైన్లు బాగు చేస్తారు.



మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద పక్కన పడేసిన సామగ్రి

వైసీపీ హయాంలో పనులకు బ్రేక్

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ గురించి ఆలోచన చేయలేదు సరికదా టూటౌన్‌లో 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను కూడా కొనసాగించకుండా మోకాలడ్డింది. 2018లో అమృత్ నిధులతో 1, 29, 38, 39, 40, 50 డివిజన్లలో రూ.37.48 కోట్లతో అమృత్ పథకంలో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. చింతలపూడి సబ్ బేసిన్ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు పనులు ప్రారంభించింది. దీనికి అనుసంధానంగా తంగెళ్లమూడిలో 50 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) నిర్మాణం ప్రారంభించారు. ఈ ఆరు డివిజన్లలో భూగర్భంలో పైపులైన్లు వేయడానికి రోడ్లన్ని తవ్వారు. పైపులు కొనుగోలు చేశారు. 21 కిలోమీటర్ల భూమిలో పైపులైన్లు వేయడానికి రంగం సిద్ధం చేశారు. అనంతరం 2019లో అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం రావడంతోనే ఆ పనులన్నీ ఆగిపోయాయి.

టీడీపీ ప్రభుత్వం రాకతో పరుగులు..

2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెంటనే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభించి 50 లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నాలుగునెలల్లో పూర్తి చేసింది. స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి ఈ ఎస్‌టీపీని ట్రయల్‌రన్ వేసి ప్రారంభించారు. ఇప్పుడు పైపులైన్లు వేసి ఈ ఎస్‌టీపీకి అనుసంధానం చేయాల్సి ఉంది. టూటౌన్‌లో త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశాలున్నాయి. వన్‌టౌన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనుల డీపీఆర్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి, పారిశుధ్య విభాగం ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ నుంచి టెక్నికల్ అనుమతి రాగానే అవి కూడా త్వరలో ప్రారంభిస్తామని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు, పోలీసు అధికారులు

మహిళల రక్షణే ప్రథమ కర్తవ్యం : ఏఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా రక్షణే ప్రథమ కర్తవ్యంగా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం విధులను నిర్వర్తిస్తోందని అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. శక్తి టీమ్‌లను జిల్లాలో ఏర్పాటు చేసిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆ టీమ్ సభ్యులతో ఆదివారం ఏఎస్పీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ శక్తి టీమ్‌లను జిల్లాలో ఏలూరు టౌన్, ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్ల పరిధిలో ఆరు టీమ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒక్కొక్క టీమ్‌లో ఎస్ఐ, ఇద్దరు మహిళా సిబ్బంది, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారని, ఈ బృందాలు మఫ్టీలో విధులను నిర్వర్తిస్తాయన్నారు. మహిళలు, చిన్నారులకు భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆపద సమయంలో 112 లేదా 100 కాల్స్‌తో శక్తి టీమ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుంటాయన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఏలూరు మహిళా ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఎస్ఐలు, శక్తిటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గుబ్బల మంగమ్మ జాతర

బుట్టాయగూడెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అడవి బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మతల్లి గిరిజన జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈనెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన జిల్లా నాయకుడు కరాటం సాయిబాబా, పీవో కె.రాములు నాయక్, యు.ఏసుబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అనంతరం మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ మూడు రోజుల పాటు ఆలయం వద్ద పీఠాధిపతి వర్స పుల్లారావు ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో గిరిజన కళాకారులు నృత్యాలు చేశారు.

నేడు విధుల బహిష్కరణకు ఆరోగ్యమిత్రల పిలుపు

7 బ్యాంక్ ఉద్యోగి అనుమానాస్పద మృతి
- రైలు ఢీకొని మృతి చెందాడని ప్రాథమిక నిర్ధారణ

మంచు కురిసే వేళలో..

సన్‌డే ఎండలు



తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి హైవేపై మంచు సోయగం



ఆకివీడులో..

లింగపాలెంలో..

దెందులూరు వద్ద మంచు తెర మాటున రైల్వే ట్రాక్



ఉండిలో..



కామవరపుకోటలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆదివారం ఉదయం పొగమంచుతో ప్రకృతి ఆహ్లాదకరంగా కనిపించింది. పచ్చని చేలు, హైవేపై మంచు దుప్పటి కప్పుకుని కనువిందు చేసింది. ఎనిమిది గంటల వరకు మంచుతో తడిసిన ప్రకృతి పులకించింది. ఉదయం సమయాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించారు. మరోవైపు ఉదయం 11 గంటల నుంచే ఎండలు ఠారెత్తాయి. భానుడు ఉగ్రరూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

– న్యూస్ నెట్వర్క్



తాడేపల్లిగూడెంలో..

ముదినేపల్లిలో

ఉండిలో చెట్టు కింద కూర్చున్న కూలీలు



ద్వారకాతిరుమలలో చెట్టు నీడన సేదతీరుతున్న శ్రీవారి భక్తులు



భీమవరంలో హీరో, హీరోయిన్ నితిన్, శ్రీలీల డ్యాన్స్.. హీరో అభివాదం

భీమవరంలో 'రాబిన్ హుడ్' సందడి

ఎస్ఆర్‌కేఆర్ కాలేజీలో అలరించిన హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల

భీమవరం అర్బన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : హాయ్..హలో.. ఎలా ఉన్నారు బాగున్నారా.. అంటూ సినీ హీరో నితిన్ భీమవరంలో సందండి చేశారు. మైత్రీ మూవీస్ బ్యానర్‌పై నితిన్, శ్రీలీల జంటగా నటించిన రాబిన్ హుడ్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన కల్చరల్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. హీరో మాట్లాడుతూ 'నేను చదువుకునే రోజుల్లో ఎగ్జామ్ పేపర్స్‌ను దొంగిలించానని.. తర్వాత మా ఆవిడ హృదయాన్ని కూడా దొంగలించానన్నారు. హీరోయిన్ మాట్లాడుతూ 'నేను హాస్టల్ ఉండే సమయంలో మేకప్ కిట్‌లు దొంగలించానని చమత్కరించారు. అనంతరం డ్యాన్స్‌లు వేశారు. కార్యక్రమంలో మైత్రీ మూవీ అధినేత రవిశంకర్, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలయ అధికారులు అందించిన బాండుపత్రాన్ని చూపిస్తున్న దాత కుటుంబం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుని కుటుంబం ఆదివారం రూ.మూడు లక్షలను విరాళంగా అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కేసరపల్లికి చెందిన జాస్తి మధుకల్యాణ్ ఈ విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాత కుటుంబానికి విరాళం బాండు పత్రాన్ని అందించారు. శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

- ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్
- నేడు విధుల బహిష్కరణకు ఆరోగ్యమిత్రల పిలుపు

ఏలూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధనకు ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పనిచేస్తోన్న ఆరోగ్యమిత్రలు చేపట్టిన దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం విధుల బహిష్కరణకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద నమోదైన 63 నెట్‌వర్క్ ఆసుపత్రులుండగా, వీటిలో 120 మంది ఆరోగ్య మిత్రలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రోజుకు సగటున 300 మందికిపైగా రోగులు వైద్యచికిత్సలు, సలహాల నిమిత్తం వస్తుంటారు. ఈవిధంగా ఆసుపత్రికి వచ్చే రోగిని ఔట్ పేషెంట్ కింద ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత వైద్య నిపుణుని వద్దకు తీసుకెళ్లి వైద్యసేవలందేలా చూడడం ఆరోగ్య మిత్రల విధి. మలి విడత ఆందోళనలో భాగంగా సోమవారం విధుల బహిష్కరణకు పిలుపునివ్వడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అదనపు సీఈవో ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఓబుల్‌నాయుడు, జేఈవో రామ్‌గోపాల్ ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యమిత్రల ఆందోళనకు చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై జూమ్ మీటింగ్ నిర్వహించి సూచనలు చేశారు.



టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, తదితరులు

భీమవరంలో టెన్నిస్ పోటీలు ప్రారంభం

భీమవరం అర్బన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అని రాష్ట్ర పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం సాయంత్రం బెలూన్లను ఎగురవేసి ప్రారంభించారు. పోటీల నిర్వహణకు క్లబ్ సభ్యులతోపాటు, దాతల సహకారం ఎనలేనివన్నారు. క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, పీవీ రామరాజు మాట్లాడుతూ మెన్స్ డబుల్స్ 35+,45+,55+,64+,70+,75+ విభాగాల్లో జరిగే పోటీలు ఈనెల 21వరకు జరుగుతాయన్నారు. టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.రాంబాబు మాట్లాడుతూ పోటీల్లో తమిళనాడు,కర్ణాటక, బెంగళూరు, ఒడిశా, తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. కాస్మోక్లబ్ సభ్యులు యూఆర్ పీఆర్ వర్మ, కె.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు

నల్లజర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా పులివెందులలో ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి 34వ కబడ్డీ పోటీలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ జట్టు సెమీఫైనల్ చేరినట్టు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. తొలుత గుంటూరు, కర్నూలు జట్లపై విజయం సాధించింది. అనంతరం శ్రీకాకుళం జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరినట్టు కోచ్ జి.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఫైనల్స్ ప్రకాశం జిల్లా జట్టుపై ఆడుతుందని ఆయన తెలిపారు.

క్రైం వార్తలు

బ్యాంక్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

- రైలు ఢీకొని మృతి చెందాడని ప్రాథమిక నిర్ధారణ



నవీన్‌సాగర్ (ఫైల్)

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో పనిచేసే ఒక ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో రైలుపట్టాలు సమీపంలో మృతి చెందాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు, రైల్వే పోలీసులు పరిశీలించి ప్రాథమికంగా రైలు ఢీకొనడం వల్లే మరణించాడని నిర్ధారణకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు ఇజ్రాయిల్ పేటకు చెందిన సందోలు నవీన్‌సాగర్ (43) పెదవేగిలోని చైతన్య గోదావరి బ్యాంకులో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన సత్రంపాడులో ఉంటున్నారు. ఆయనకు భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్దకుమార్తె బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. రెండో కుమార్తె ఇంటర్ చదువుతోంది. ఈనెల 15న యథావిధిగా బ్యాంక్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తూ సీఆర్‌ఆర్ కాలేజీ సమీపంలో బైక్‌పై పెట్టి రైలు పట్టాలపై బహిర్భూమికి వెళ్లారు. ఆ సమయంలో రైలు ఢీ కొనడంతో అతను ఎగిరి రైలు పట్టాల దిగువ భాగానికి పడిపోయారు. అతను రాత్రి అంతా రాలేదని కుటుంబ సభ్యులు, బంధువులు వెతకగా బైక్ సీఆర్‌ఆర్ కాలేజీ సమీపంలో కనిపించింది. దిగువ భాగాన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కోటేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మరోవైపు పోలీసు జాగిలంతో పరిశీలన చేయించారు. ఈ నేపథ్యంలో అతను పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొందని నిర్ధారణకు వచ్చారు. రైల్వే ఎస్ఐ పి. సైమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ ట్యాక్సీ డ్రైవర్ మృతి

ఏ కారణమో తెలియదు కాని పురుగుల మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తణుకులో నరేంద్ర సెంటర్‌కు చెందిన మాడుగు సోమేశ్వరరావు (36) ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య రమ్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈనెల 13న ఏ కారణమో తెలియదు కాని పురుగుల మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని తొలుత తణుకు ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతను ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తణుకు పోలీసులు వచ్చి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.



ఆచంటేశ్వరుడి సన్నిధిలో దేవదాయ శాఖ మంత్రి ఆనం, ఎమ్మెల్యే పితాని

ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం

ఆచంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను నిర్వహిస్తామని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆచంట ఆచంటేశ్వరుని స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మంత్రిని అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. దర్శనం అనంతరం గొడవర్తి శ్రీరాములు గంధర్వ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ప్రజలకు ఇంకా చేరువయ్యేలా మంచి జరగాలని ఆచంటేశ్వరుని కోరుకున్నానన్నారు. గోదావరి పుష్కరాలకు ముందే అఖండ గోదావరి ప్రాజెక్టును నెలకొల్పుతామని, సీఎం ఆధ్వర్యంలో ప్రణాళికలు చేపడుతున్నట్టు తెలిపారు. అంతిర్వేదిలో ఉన్న రథకం కాలిపోయినా ఘటనపై శాసన మండలిలో తాను చర్చించడం బాధ కలిగించిందన్నారు. సోమవారం అంతిర్వేది పుణ్య క్షేత్రాన్ని సందర్శిస్తానన్నారు. దేవాలయాల అభివృద్ధికి, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకునే విధంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆచంటలో పురాతనమైన ముత్యాలమ్మ ఆలయ పునఃనిర్మాణానికి సంబంధిత అధికారులను పంపించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామన్నారు. గొడవర్తి శ్రీరాములు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, అధికారులు, ఈవో ఎ.వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

22నుంచి నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు, తదితరులు

దేవరపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈనెల 22నుంచి 25 వరకు నిర్వహిస్తామని పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రం ప్రారంభించి 40 ఏళ్లయిందని, 2000 సంవత్సరంలో నిర్మలగిరి క్షేత్రంలో ప్రధాన దేవాలయం నిర్మించి 25 ఏళ్లయిన సందర్భంగా ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, చిన్నారులు, వృద్ధులకు పాలు, మజ్జిగతో పాటు నిత్యఅన్నదానం జరుగుతుందన్నారు. భక్తులకు శాంతి కలిగేందుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామన్నారు. 250 మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలతో ఏర్పాటుతో పాటు పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పుణ్యక్షేత్ర సందర్శనకు ఉభయ రాష్ట్రాల నుంచి పది లక్షల వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం పొలిమేర జయరావును పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, నిత్య అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళేపల్లి నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. రెవరెండ్ ఫాదర్లు పి.బాల, డి.ఆరోన్ తదితరులు పాల్గొన్నారు.



'అసత్యం' నాటికలో సన్నివేశం

స్ఫూర్తిదాయకంగా నాటిక ప్రదర్శనలు

పాలకొల్లుఅర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన జాతీయస్థాయి నాటక పోటీలలో రెండో రోజు ఆదివారం స్ఫూర్తిదాయకమైన మూడు నాటికలు ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనగా హైదరాబాద్ వారి 'ఇది రహదారి కాదు' నాటికలో సముద్రాలుగా బి.నాగరాణి, సూరీడుగా బి.దేవేష్, కిషోర్‌గా సీహెచ్ జగదీష్, నాగుగా మంజునాథ్, పార్థుగా టి.సుజిత్, రైలు బాబాయ్‌గా ఎస్ఎం బాషా, దివ్యగా పూజిత సింధూరి నటించగా, సంగీతాన్ని సురభి నాగరాజు, లైటింగ్‌ను నోరి రామ్మోహన్, సెట్‌ను అర్షద్, నోరి రామ్మోహన్, ఆహార్యంను పి.గిరిధర్, కాగా రచన ఆకురాతి భాస్కరరావు, ఎస్ఎం బాషా దర్శకత్వం వహించారు. కథాసారాంశం ఇలా.. వివాహ వ్యవస్థపై దారి తప్పుతున్న యువతను చక్కదిద్దే విధంగా కథను మలిచిన తీరు ఆకట్టుకుంది.

- రెండో ప్రదర్శనగా కళాస్రవంతి (విశాఖ) ప్రదర్శించిన 'అసత్యం' నాటికకు కథను శ్రీసుధ మోదుగు అందించగా, నటాకీకరణను పిన్నమనేని మృత్యుంజయరావు, దర్శకత్వాన్ని పి.బాలాజీ నాయక్, నటవర్గం : వివయ్యగా పి.బాలాజీ నాయక్, బసవయ్యగా ఎ.రామారావు, రఘుపతిగా వై.అనిల్ కుమార్, కనకయ్యగా ఎం.వాసు, వెంకట్రావుగా థామస్, పార్వతిగా ఎస్.మాధవి అభినయించగా, సంగీతాన్ని పి.తులా మోహన్, ఆహార్యం థామస్, రంగాలంకరణను ఎం.సత్తిబాబు, థామస్ సమకూర్చారు. కథాసారాంశం ఇలా.. దైవత్వమైనా, రాక్షసత్వమైన, స్వార్థమైనా, పరమార్థమైనా అది మనిషి హృదయంలో ఉంటుంది. ప్రతి సత్యం వెనుక అసత్యం.. ఏది సత్యమో, ఏది అసత్యమో కంటికి కనిపించేదంతా సత్యం కాదు. కనిపించనిదంతా అసత్యం కాదు, కథాంశంతో రూపొందించిన కథను పాత్రధారులు నటనా ప్రతిభతో ప్రేక్షకులను అలరించారు.
- మూడో ప్రదర్శనగా శ్రీమద్దుకూరి క్రియేషన్స్ (చిలకలూరిపేట) వార 'మా ఇంట్లో మహాభారతం' నాటికను ప్రదర్శించారు.



పరీక్ష రాసేందుకు వెళుతున్న అభ్యర్థులు

ఏపీపీఎస్సీ పరీక్ష ప్రశాంతం

- 134 మంది హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో గైర్హాజరీల సంఖ్య అధికంగా ఉంది. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల పరీక్ష కేంద్రానికి 180 మంది అభ్యర్థులను కేటాయించగా 74 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 120మందిని కేటాయించగా 60 మంది హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలవకొలను తులసి

నరసాపురంలో 21 నుంచి హస్తకళల ప్రదర్శన

- లేసు ట్రేడింగ్ సెంటర్ కన్వీనర్ తులసి

నరసాపురం రూరల్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): రుస్తుంబాద లేసు ట్రేడింగ్ సెంటర్‌లో ఈనెల 21 నుంచి 25 వరకు ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హస్తకళల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు లేస్ ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసి తెలిపారు. ఆదివారం ట్రేడ్ సెంటర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ప్రదర్శనకు పలు రాష్ట్రాల నుంచి వంద మందికిపైగా చేతివృత్తిదారులు హాజరవుతున్నారన్నారు. 80 స్టాల్స్ ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తుమన్నారు. ప్రదర్శనలో హస్తకళల ఫ్యాషన్, జ్యుయలరీ, గృహోపకరణాలు, హోం పర్నీచర్, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, తదితర వస్తువులను ప్రదర్శిస్తామన్నారు. ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నాయకర్, పితాని సత్యనారాయణ పాల్గొంటారన్నారు. సమావేశంలో కలవకొలను తాతాజీ, రాజీవ్ పాల్గొన్నారు.



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ

పొట్టి శ్రీరాములు జయంతి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు డాక్టర్ బి.గోవిందరాజులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి : ఎస్‌ఐ

ఏలూరు క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారి సమాచారం ఇవ్వాలని పెదపాడు ఎస్‌ఐ కట్టా శారదా సతీష్ ప్రజలను కోరారు. మండల పరిధిలో ఎవరైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలు జరిగితే వెంటనే 112కు సమాచారం అందించాలన్నారు. తన సెల్ నెంబర్ 9440796637కు సమాచారం అందించాలని ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు నేటి నుంచి ఉచిత బస్సు సౌకర్యం

ఏలూరు క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : పరీక్షలు రాసే టెన్త్ విద్యార్థులకు జిల్లాలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఉన్న ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఉచిత ప్రయాణాన్ని కొనసాగించవచ్చని, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.

గుంటూరులో నేడు రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ)రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును సోమవారం నిర్వహిస్తున్నట్టు బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎంపికైన వ్యవసాయ కార్మిక సంఘ ముఖ్య కార్యకర్తలు కొత్తపేటలోని తమ కార్యాలయానికి వస్తే అక్కడి నుంచి గుంటూరుకు వెళ్లనున్నట్టు తెలిపారు. ఉపాధి హామీ చట్టంపై గ్రామీణ కష్ట జీవులు సంక్షేమం, అభివృద్ధి పైన మేధావులు పాల్గొని కార్యకర్తలకు బోధిస్తారని తెలిపారు. గ్రామీణ పేదల సమస్యలపై ఇంకా అనేక అంశాలపై వర్క్‌షాపులో చర్చ జరుగుతుందన్నారు. జిల్లా నుంచి ఎంపికైన సంఘ సభ్యులు సకాలంలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

శ్రీవారి సేవలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

ద్వారకాతిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి) :శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి ఆదివారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

సామాజిక సేవతోనే పదవులకు సార్థకత


కార్యవర్గాన్ని సత్కరిస్తున్న చిన్ని, తదితరులు

జంగారెడ్డిగూడెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : సమాజ సేవతోనే పదవులకు సార్థకత లభిస్తుందని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్య నారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా సిటీ కేబుల్ కార్యాలయంలో రోటరీ ఇన్నర్ వీల్ కార్యవర్గాన్ని, సిటీ న్యూస్ రీడర్‌ను ఆది వారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా సమాజంలో ఉన్న ఎంతో మంది పేదలకు సాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు నాగసూరి మాధురి, కార్యదర్శి పద్మజ్యోతి, కోశాధికారి ఆదిలక్ష్మి, న్యూస్ రీడర్ సాయి, చిన్ని సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గో మాంస విక్రయాన్ని అడ్డుకున్న నాయకులు

కుక్కునూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : గోమాంసాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని గో సంరక్షణ కుక్కునూరు మండల నాయకులు అడ్డుకున్నారు. గత కొన్ని రోజులుగా గోమాంస విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఆదివారం తెల్లవారు జామున ఒక వాహనంలో గో మాంసాన్ని తరలిస్తున్న వ్యక్తిని వాహనాన్ని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చారు. గోరక్షణ అధ్యక్షులు తూము వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో విచ్చలవిడిగా గోమాంసాన్ని విక్రయిస్తున్నారని ఆరోపించారు. సరిహద్దు చెక్ పోస్టుల్లో తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే గోమాంసం విక్రయదారుల ఆటలు సాగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కె.వి.ఎస్.దొర, దుద్దుకూరి కృష్ణార్జునరావు, గుప్తా లక్ష్మణరావు, వేముల శేషగిరి, వీర పుల్లారావు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

టి.నరసాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : సమస్యలపై పోరాటాలకు ప్రజల్లో చైతన్యం రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్రను మండలంలో 16,17 తేదీల్లో నిర్వహించతలపెట్టారు. ఈ మేరకు మొదటి రోజు ఆదివారం మండల కేంద్రమైన టి.నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో సీపీఎం మం డల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పాదయాత్ర ప్రారంభించారు. మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్, ప్రకాశ్ నగర్ గ్రామాల మీదుగా పాదయాత్ర రామమ్మగూడెం చేరింది. పంటలకు గిట్టుబాటు ధర, ఉపాధి కూలీల పనులు, చింతలపూడి ఎత్తిపోతల పథకం, గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు, అనుమేలు మురళీ, మరగడ కుమారి, శిరీష పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోయారు

ఏలూరు రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో మాజీ సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తెస్తే ఆ పథకాలను ఇప్పుడున్న ప్రభుత్వం నిలిపివేసిందని, ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దుయ్యబట్టారు. వైసీపీ ఏలూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లుడుతూ చంద్రబాబు పర్యటనలో తణుకును దిగ్బంధనం చేశారని, తేతలిలో పశువధ కర్మాగారం అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారన్నారు.ఆరిమిల్లి రాధాకృష్ణపై విమర్శలు చేస్తూనే తణుకు స్వచ్ఛాంధ్ర సభ చంద్రబాబు భజనతో సాగిందన్నారు.

ఉత్సాహంగా జిల్లా చదరంగం పోటీలు

ఏలూరురూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఆర్‌పేటలోని ఏలూరు పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో చెస్ అసోసియేషన్ ఆఫ్ హేలాపురి ఆధ్వర్యంలో అండర్-15 ఏలూరు జిల్లా చదరంగం పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎలైట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ పి.భాస్కర్ రామన్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో జి.అభిషేక్ అవరహం ప్రథమ, ఎన్.వర్షిత్ ద్వితీయ, జి.అనురూప్ మోషే తృతీయ స్థానం, ఎస్.కె.పర్వాన్ నాల్గవ స్థానం సాధించారు. రెహ్మాన్, రవికుమార్, డైరెక్టర్ ఎస్.సుధాకర్, చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.యోహానన్, ఆర్బిటర్, పి.దివ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అవార్డు స్వీకరిస్తున్న శ్రీనివాస్

అభినవ రామానుజ అవార్డుతో సత్కారం

ఏలూరురూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : రామానుజ సమత సిద్ధాంత వ్యాప్తికి చేస్తున్న కృషిని గుర్తించి లింగపాలేనికి చెందిన తిరుక్కోవళ్ళూరి శ్రీనివాస పెరుమాళ్‌కు హైదరాబాదుకు చెందిన సర్ సి.వి.రామన్ సాంస్కృతిక సేవా సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం గోల్డ్ మెడల్‌ను, సువర్ణ గంటా కంకణ సత్కారంతో పాటు అభినవ రామానుజ అవార్డును ప్రదానం చేశారు. సికింద్రాబాదులోని హరిహర కళాభవన్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు.భాగవత సదనం, తిరుప్పాణీయం అనే భక్తి ఆధ్యాత్మిక సంస్థలను స్థాపించి రాష్ట్రంలో అనేక మందిని సమత భావం గల భాగవతులుగా తీర్చిదిద్ది అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి అభినవ రామానుజ అవార్డును అందజేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీరి శిష్యులంతా హర్షం ప్రకటించారు.

కోకో సాగులో మెలకువలపై రైతులకు అవగాహన

పెదవేగి/ఏలూరు సిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కొబ్బరి, పామాయిల్ పంటలో అంతర పంటగా కోకో సాగు రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుస్తుందని జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ తెలిపారు. ప్రధానంగా కొబ్బరిలో అంతరంగా కోకోను విజయవంతంగా సాగుచేస్తూ రైతులు ప్రయోజనం పొందుతున్నారని ఆయన చెప్పారు. పెదవేగి మండలం రామశింగవరం, కొండలరావుపాలెం, వంగూరు, తాళ్ళగోకవరం గ్రామాల్లో కోకో సాగు చేసే విధానం, యాజమాన్యంలో తీసుకునే మెళకువలపై రైతులకు ఆదివారం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రామ్మోహన్ మాట్లాడుతూ కోకో సాగులో అంతర్జాతీయంగా తలెత్తిన ఒడిదుడుకుల కారణంగా గతేడాది కోకో గింజలకు ధర ఒకేసారి నాలుగింతలైందన్నారు. స్థానికంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో చాక్లెట్ తయారీదారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌సీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.కాళిదాస్, మోండలీజ్ సంస్థ మేనేజర్ రవి, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ అయ్యన్నబాబు, పెదవేగి మండల ఉద్యానశాఖాధికారిణి ఎం.రత్నమాల పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

కట్టడి చేయాలంటున్న ఆయా గ్రామాల ప్రజలు



లింగపాలెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బెడదతో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. రహదారులు, పాఠశాలలు, బస్టాండ్‌లు ఇలా ప్రతి చోటా వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ఎటు వైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.ఇటీవల లింగపాలెం మండలంలో వీధికుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. మండలంలో మూడు ప్రభుత్వ ఆసుపత్రులు ఉండగా వాటిలో నిత్యం కుక్కల దాడిలో గాయపడిన వారు వస్తూనే ఉన్నారు.వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహనదారులు, పాఠశాలల విద్యార్థులను వెంటపడి కరుస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు చేతిలో కర్రలు పట్టుకుని తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎన్నోసార్లు అధికారులకు ఈ విషయం తెలిపినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే

చింతలపూడి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. చింతలపూడి మండలంలో మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో చింతలపూడిలో ఆరు సెంటర్లు, యర్రగుంటపల్లిలో ఒకటి, ప్రగడవరంలో ఒకటి ఏర్పాటు చేశారు. మొత్తం 1470 మంది ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు,పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఎంఈవోలు రామారావు, కిరణ్ పర్యవేక్షిస్తున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

పెదవేగి : టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తూ పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. పెదవేగి మండలంలో 13 జడ్పీ ఉన్నత పాఠశాలలు, 7 ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 919 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్నారు. పరీక్షల నిర్వహణకు అనువుగా ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో- 2 వి.అరుణ్ కుమార్ తెలిపారు. తహసీల్దార్ ఎస్.డి.భ్రమరాంబ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

కామవరపుకోటలో ఏర్పాట్లు...

కామవరపుకోట : టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి డి.సుబ్బారావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. మండలం నుంచి మొత్తం 705 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈవో తెలిపారు.

ఉంగుటూరు మండలం నుంచి..

ఉంగుటూరు/నిడమర్రు : ఉంగుటూరు మండలంలో ఐదు సెం టర్లలో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు మండల విద్యాశాఖాధికారిణి నిమ్మగడ్డ రవీంద్ర భారతి తెలిపారు. మండల వ్యాప్తంగా 799మంది పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు. నిడమర్రు మండలం నుంచి 396 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఎంఈవో భాస్కరరావు తెలిపారు.

ఆరు పరీక్ష కేంద్రాల ఏర్పాటు..

భీమడోలులో : మండలంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. మండలం నుంచి మొత్తం 979 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే ప్రైవేటుగా 185 పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

112 మంది ఇన్విజిలేటర్ల ఏర్పాటు...

జంగారెడ్డిగూడెం : టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో-2 రాములు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 112 మంది ఇన్విజిలేటర్లను నియమించగా 2,368 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

సెల్, స్మార్ట్ ఫోన్లకు అనుమతి లేదు..

లింగపాలెం : టెన్త్ పరీక్షలకు మండలం నుంచి 633 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు మండల విద్యాశాఖ అధికారి కంఠా రామారావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌లు, లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని ఎంఈవో తెలిపారు.

ఐటీడీఏ పరిధిలో ఏర్పాట్ల పరిశీలన

బుట్టాయగూడెం : కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని ఐదు ఏజెన్సీ మండలాలతో పాటు చింతలపూడి, టి.నర్సాపురం మండలాల్లోని 28 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు చెందిన 948 మంది విద్యార్థులు సోమవారం నుంచి జరగబోయే టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నట్లు ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం : ఏఎస్పీ


చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు.పొట్టి శ్రీరాములు జయంతిని పు రస్కరించుకుని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం ప్రజలకు ధైర్యం, త్యాగం, పట్టుదల ఎలా ఉండాలో తెలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ పవన్ కుమార్, కైకలూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, ఎస్‌ఐ రాజారెడ్డి, ఆర్ఎస్‌ఐ భాస్కరరావు, ఎస్బీసీసీ అబ్దుల్ అలీమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి సత్రం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు దివ్వెల జయబాబు, వర్కింగ్ అధ్యక్షుడు మద్దుల రవికుమార్, బచ్చు విష్ణు, జి.గోపి, గూడపాటి సత్యనారాయణ,ఎస్.చంద్రశేఖర్ సాయి, యువజన సంఘం అధ్యక్షుడు ఒబిలిశెట్టి శ్రావణ్, చలువాది పవన్‌కుమార్, సంఘ నాయకులు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కామవరపుకోట : ఆంధ్రరాష్ట్ర సాధనకు ప్రాణాలను ఫణంగా పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం కామవరపుకోట, తడికలపూడి, రావికంపాడు గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు, విగ్రహాలకు ఆర్య వైశ్య సంఘ నాయకులు, వాసవీ, వనితా క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పెదవేగి : అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతారని ఆర్య వైశ్య సంఘం వాసవీ క్లబ్ పెదవేగి అధ్యక్షుడు కొనకళ్ల నాగేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పెదవేగిలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం వాసవీ క్లబ్ కార్యదర్శి కందుల బలరామకృష్ణ, కోశాధికారి కొనకళ్ల బలరామకృష్ణ, సభ్యులు పాపారావు, కృష్ణబాబు, వెంకటేశ్వరరావు, కాశీబాబు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి చింతలపూడి పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు చుండూరి అబ్బయ్య, శివాజీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. రామకృష్ణ, విశ్వేశ్వరరావు, కుమార్ రాజా, ఈశ్వర్ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం : ఆంధ్రరాష్ట్ర ఆవతరణకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి తెలిపారు.మండలంలోని టి.నర్సాపురం, బొర్రంపాలెం, కేతవరం, తిరుమల దేవిపేట గ్రామాల్లో పొట్టిశ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహించారు.

విజనరీ లీడర్ చంద్రబాబు : గన్ని


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

నిడమర్రు మార్చి 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే చంద్రబాబు విజనరీ లీడర్‌గా ప్రపంచ గుర్తింపు పొందిన ఏకైక నాయకుడని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం బావాయిపాలెంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు శాసనసభలో అడుగుపెట్టి 47 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల భవిష్యత్ కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఒక వ్యక్తి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో మనగలగడం ప్రపంచ రికార్డుగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు, అంబళ్ల విజయ భాస్కర్‌రావు, మహమ్మద్ గఫ్ఫార్‌ఖాన్, ముత్యాల పెద బాబు, పైడికొండల శివాజి, ఎండి జాకీర్, తాడిసాయి, గణసల ఆదినారాయణ, సత్తినీడి నాని పాల్గొన్నారు.

60 శాతం రోడ్ల నిర్మాణం : చంటి


రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విలీన గ్రామాల్లో 60శాతానికి పైగా రోడ్లను నిర్మించామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.77లక్షలతో నిర్మించనున్న రోడ్లకు ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్ నూర్జహాన్‌లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రచారానికి తిరిగినప్పుడు రోడ్లన్ని అధ్వానంగా ఉన్నాయన్నారు. హామీ మేరకు తమ ప్రభుత్వం రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ సురేంద్రబాబు, డీఈలు రజాక్, కొండలరావు, ఏఈలు సాయి, సంధ్యా, కార్పొరేటర్లు లక్ష్మీ ప్రసాద్, అనూష, నాగబాబు, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

దెందులూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మైనింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అంకన్నగూడెం నుంచి వంగూరు, కొత్తపల్లి, గాలాయగూడెం, గంగన్నగూడెం, జోగన్నపాలెం, నాగులదేవుని పాడు, మండూరు, ఏడవమైలు, మేదినరావుపాలెం పంగిడిగూడెం గ్రామాల పరిధిలో పోలవరం కుడి కాల్వ గట్టు మట్టిని అక్రమార్కులు అర్ధరాత్రులు తరలించుకుపోతున్నారు. ఆదివారం సమయంలో రాత్రి 11 గంటలు దాటిన తరువాత ట్రాక్టర్లు, లారీలతో మట్టిని తరలిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోస్టాఫీసులో చోరీకి విఫలయత్నం

జంగారెడ్డిగూడెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పేరంపేట రోడ్‌లోని హెడ్ పోస్టాఫీసులో దుండగులు చోరీకి విఫల ప్రయత్నం చేశారు.లోపల ఎటువంటి వస్తువులు, డబ్బు చోరీకి గురికాలేదన్నారు. సిఐ కృష్ణబాబు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

హస్త కళలకు వెదురు కలప

బుట్టాయగూడెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలోని పిఆర్ గూడెం, ముంజులూరు, చింతపల్లి, ఉప్పర్లిల్ల, కల్లుమామిడి, గోగుమిల్లి, ఉర్రింక చెందిన కొండరెడ్డి హస్తకళాకారులకు అటవీ ఉత్పత్తులను తయారు చేసుకోడానికి అనువైన వెదురు కలపను అందించడం కోసం చర్యలు తీసుకుంటున్నట్టు రాజమండ్రి సీసీఎఫ్ బీఎంఎం మూర్తి తెలిపారు. ఆదివారం కన్నాపురం రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పర్యటించి అనువైన వెదురు కలపను పరిశీలించారు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్లో భాగంగా హస్తకళల తయారీలో శిక్షణ పొందినవారికి కలపను అందించడం, వారి నైపుణ్యాన్ని పెంపొందించడం, వస్తువులకు మార్కెటింగ్ కల్పించడం జరుగుతుందన్నారు. వెదురును అందించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బ్యాక్ సంస్థ పారిశ్రామికవేత్త కార్ పే ఖాన్, జిల్లా అటవీశాఖ అధికారి శుభం, రీసెర్చి డిఎఫ్‌వో ఆర్.శ్రీనివాస్, రేంజ్ ఆఫీసర్లు శివరామకృష్ణ, దావీదురాజు నాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గోవిందనామ స్మరణతో చినవెంకన్న క్షేత్రం మార్మోగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామివారి దర్శనార్థం వేలాదిగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి భక్తులకు గంటపైబడి సమయం పట్టింది. దాదాపు పదిహేను వేల మందికి పైబడి యాత్రికులు ఆదివారం స్వామిని దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

దీక్షాకాలం ప్రార్థనలకు ఆహ్వానం

పెదవేగి, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను పలువురు క్రీస్తు మాలధారులు కలిసి దీక్షాకాలం ప్రార్థనలకు రావాలని ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు.

పోతునూరులో చలివేంద్రం ప్రారంభం

దెందులూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతునూరు గ్రామంలో సిరి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌ఆర్‌ఐ కేడే సత్యనారాయణ(చిన్ని), నిర్వాకులు ఈశ్వరరావులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు నిమ్మరసం, మజ్జిగ అందజేశారు.

స్వరమాధురి ఆత్మీయ సమ్మేళనం

చింతలపూడి, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : వీకేఎం ఫంక్షన్ హాల్లో స్వరమాధురి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉభయ రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది మహిళలు పాల్గొని గీతాలాపనలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తపనా చౌదరి మాట్లాడుతూ తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుగంధం రాంబాబు, ఆకుల పురుషోత్తం, కంభంపాటి వాసు, ఎస్.ఎస్.ఎన్.గాంధీ, పలువురు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

ఏలూరురూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడంలేదని సర్పంచ్‌లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పి.శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని సూచించారు.

జరజాపు రాఘవకు ఘన సత్కారం

ఏలూరు రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు నగర యువజన అధ్యక్షుడిగా జరజాపు రాఘవ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగవంశ సంక్షేమ సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం జిల్లా సెక్రటరి పి.వెంకట్రావు మాట్లాడుతూ నాగ వంశీయులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో సముచిత స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రీజియన్ కో-ఆర్డినేటర్ల సమావేశం

ఏలూరు రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అధ్యక్షతన ఆదివారం ఏలూరు గ్రీన్ సిటీలోని లయన్స్ భవనంలో జిల్లా నాల్గవ కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జిల్లాలోని క్లబ్‌లు నిర్వహించి సేవా కార్యక్రమాల గురించి రీజియన్ జోన్ ఛైర్ పర్సన్ యాక్షన్ టీమ్ కో-ఆర్డినేటర్లచే సమీక్షలో సేవల గురించి చర్చించారు. కాకర్ల వేణుబాబు మాట్లాడుతూ లయన్స్ అంతర్జాతీయ సంస్థ అందించే చేయూతకై ఇచ్చే విరాళాలు ఇప్పటి వరకు 90 వేల డాలర్లకు పైగా సేకరించినట్టు తెలిపారు. ప్రథమ వైస్ గవర్నర్ పాపారావునాయుడు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో వి.రమేష్, ఎం.శ్రీహరి, వి.రామారావు, ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఏలూరు క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎ.అవినాష్, అదే గ్రామానికి చెందిన ఎస్.విజయ్‌కుమార్‌లు రెండు మోటారు సైకిళ్లపై ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్రగా యాలయ్యాయి. పెదవేగి మండలం కవ్వగుంట అడ్డరోడ్డు వద్ద ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. మెరుగైన చికిత్స నిమిత్తం వారిని విజయవాడకు తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

టి.నర్సాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తెడ్లం గ్రామానికి చెందిన షేక్ మాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి కేతిరెడ్డి సీతారామిరెడ్డి, చంద్రకాంతమ్మ ఛారిటీ ద్వారా టీడీపీ నాయకులు కేతిరెడ్డి వీరారెడ్డి, ముప్పెన రమేష్‌రెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆదే గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ బీ ఇంటి నిర్మాణానికి కూడా సాయం అందజేశారు.

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు.అమ్మ వారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని తీవ్ర మనస్థాపానికి గురై పురుగు మందు తాగిన వ్యక్తి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులోని గీత కాలనీకి చెందిన గొర్రె కిరణ్ కుమార్ (36)కు మల్లవల్లికి చెందిన యువతితో వివాహమైంది. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన కిరణ్ కుమార్ ఈ నెల 13న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ ఎస్‌ఐ సిహెచ్‌కె దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చీటింగ్ కేసులో ఒకరి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసగించిన ముగ్గురిలో ఒకరిని ఏలూరు త్రిటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురానికి చెందిన చిలుపూరి దీపక్ వర్మ, విజయవాడలోని ప్రసాదంపాడుకు చెందిన పొన్నం సైదేశ్వర చౌదరి, అతని భార్య లక్ష్మీ కుమారిలు కలిసి లక్ష్మీరాజా టూర్స్ అండ్ ట్రావెల్స్ అనే పేరుతో విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ పలువురుని నమ్మబలికారు. వీరిపై ఫిర్యాదు రావడంతో ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో 2019 ఏప్రిల్ 23న కేసు నమోదైంది. అప్పటి నుంచి నిందితులు పరారీలోనే ఉన్నారు. ఈ కేసులో రెండవ నిందితుడైన విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన పొన్నం సైదేశ్వరచౌదరిని ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఒక షాపులో పనిచేస్తున్న బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఏలూరు రూరల్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక(15) ఒక షాపులో పనిచేస్తోంది. ఆ బాలికకు ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన జుంట్రు పౌలు (20) పరిచయమయ్యాడు. మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన ఘటనను ఆ బాలిక తల్లితో చెప్పడంతో ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జుంట్రు పౌలుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


గ్రామంలో ఊరేగింపు దృశ్యం

శివుడి విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, సున్నా వెంకట్రావు, భూలక్ష్మీ దంపతుల ఆర్థిక సహకారంతో శ్మశాన వాటికలో శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మనవడు లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం ఉండ్రాజవరంలోని శ్మశాన వాటికలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు దాతలు తెలిపారు. గ్రామస్తులు బ్యాండు సన్నాయి మేళాలతో శివుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించి అభిషేకాలు పూర్తి చేసి పూజల అనంతరం స్మశాన వాటికలో ప్రతిష్ఠించారు.


శవపేటిక మోస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

టీడీపీ కార్యకర్త అంతిమ యాత్రలో ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త మృతి చెందడంతో ఆతని అంతిమ యాత్రలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదివారం పాల్గొన్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురానికి చెందిన టిడిపి కార్యకర్త తాడేపల్లి రమేష్ మృతి చెందిన విషయం తెలుసున్న ఎమ్మెల్యే హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఇద్దరి ఆడపిల్లల చదువు నిమిత్తం రూ.50వేలు ఆర్థిక సాయం అందచేస్తామని ప్రకటించారు. అనంతరం కార్యకర్త అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

నేడు ముదినేపల్లిలో లక్ష్మీగణపతి హోమం

ముదినేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని నిర్మాణం వేగవంతంగా, విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ సోమవారం ముదినేపల్లిలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తన నివాసంలో శ్రీ లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఇటీవల కలిసి అమరావతి అంబాసిడర్‌గా నియామకపత్రం అందుకున్న సమయంలో ఈ హోమం నిర్వహణ విషయాన్ని వైష్ణవి ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ మేరకు ఆమె ఈ హోమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆర్ఎంపీ వైద్యుల సంక్షేమానికి కృషి

కైకలూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ వైద్యుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరులోని శాంతి మినీఫంక్షన్‌హాలులో ఆర్ఎంపీ వైద్యుల వైద్యవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అను హాస్పటల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎంపీ ఏరియా గౌరవ అధ్యక్షుడు శేషుబాబు, జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరాజు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నూజివీడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ రిక్షా లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నూజివీడులో ఐఎఫ్‌టీయు ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అసంఘటిత కార్మిక రంగంలో పనిచేస్తున్న కార్మికులు నాలుగు కోట్లకుపైగా ఉన్నారన్నారు. వారికి ఇప్పటి వరకు ఎటువంటి చట్టపరమైన రాయితీలు లేవని పేర్కొన్నారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే.వి రమణ, జిల్లా కోశాధికారి మానికల నాగరాజు, నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, ఘంటశాల రాంబాబు, ముంగం అప్పారావు, దూళ్ళవీరి నాయుడు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం

ఆచంట, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో ఆచంటేశ్వర స్వామిని స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మంత్రిని అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. దర్శనం అనంతరం గొడవర్తి శ్రీరాములు గంధర్వ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ప్రజలకు ఇంకా చేరువయ్యేలా మంచి జరగాలని ఆచంటేశ్వరుని కోరుకున్నానన్నారు. గోదావరి పుష్కరాలకు ముందే అఖండ గోదావరి ప్రాజెక్టును నెలకొల్పుతామని, సీఎం ఆధ్వర్యంలో ప్రణాళికలు చేపడుతున్నట్టు తెలిపారు. అంతిర్వేదిలో ఉన్న రథకం కాలి పోయినా ఘటనపై శాసన మండలిలో తాను చర్చించడం బాధ కలిగిచిందన్నారు. సోమవారం అంతిర్వేది పుణ్య క్షేత్రాన్ని సందర్శిస్తానన్నారు. దేవాలయాల అభివృద్ధికి, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకునే విధంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆచంటలో పురాతనమైన ముత్యాలమ్మ ఆలయ పునఃనిర్మాణానికి సంబంధిత అధికారులను పంపించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామన్నారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుని కుటుంబం ఆదివారం రూ.మూడు లక్షలను విరాళంగా అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కేసరపల్లికి చెందిన జాస్తి మధుకల్యాణ్ ఈ విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాత కుటుంబానికి విరాళం బాండు పత్రాన్ని అందించారు. శ్రీవారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.



మొక్కజొన్న లారీ బోల్తా

ముసునూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి ప్రధాన రహదారిలో అదుపుతప్పి మొక్కజొన్నల లోడ్ లారీ శనివారం రాత్రి పల్టీ కొట్టింది. రమణక్కపేట నుంచి మొక్కజొన్న కండెల లోడ్ వేసుకుని లింగపాలెం ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసేందుకు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా కొట్టింది. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వెంటనే స్థానికులు బయటకు తీశారు. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆదివారం ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని బయటకు తీశారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాట్రాయి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 2003-2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. వివిధ ప్రాంతాలలో ఉద్యోగ ఉపాధి రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు కుటుంబాలతో తరలి వచ్చి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి, ఎన్నారై, తిరువూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు వల్లభనేని గిరిబాబు పూర్వ విద్యార్థుల సంక్షేమ నిధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

పొట్టిశ్రీరాములు ఆశయాలు మహోన్నతం

ఘనంగా జయంతి... చిత్రపటాలకు పూలమాలలు వేసిన నాయకులు


కైకలూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని


చనుబండలో నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

కైకలూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు ఆశయాలు మహోన్నతమైనవని నేటి యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 124జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీల నేతల ఆధ్వర్యంలో కైకలూరులోని పొట్టిశ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, నాయకులు పెన్మెత్స త్రినాధరాజు, పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, కొల్లి వరప్రసాద్, నాగమల్లేశ్వరరావు, పోలవరపు లక్ష్మీరాణి, ఎండీ జానీ, గంగుల ఏసురాజు పాల్గొన్నారు.

చాట్రాయి: చనుబండలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చెయ్యాలని కోరుతూ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించారని అన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నడిపల్లి కిషోర్, సభ్యులు కొత్తా రామలింగేశ్వరరావు, వనమా రామకృష్ణ, నారాయణ, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు యువతకు స్ఫూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పూర శ్రీధర్, నీలి సుమన్, పలివెల ప్రకాశరావు, నీలి వెంకటేశ్వరరావు, ఎన్.బాబ్జీ, బత్తుల రఘుబాబు, చక్కా జగన్, నూకల శ్యామల రావు గుప్తా, పూర ధనుష్, పచ్చిగోళ్ల ప్రసాద్, కొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన గోగులంపాడు-ముక్కొల్లుపాడు రహదారి



ముసునూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిధులు ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. ముసునూరు మండలంలోని గోగులంపాడు నుంచి ముక్కొల్లుపాడు వెళ్ళేందుకు 4.2 కిలోమీటర్ల పొడవున ఉన్న రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు వైసీపీ ప్రభుత్వ పాలనలో రూ.4.10కోట్లు నిధులు నాబార్డు నుంచి మంజూరయ్యాయి. రహదారి అభివృద్ధి పనులను ఎన్నికలకు ముందు కాంట్రాక్టర్ ప్రారంభించాడు. రహదారిని చదును చేసి, కంకర వేసి, తారు వేయకుండా వదిలివేసి పది నెలలు కావస్తుంది. ఈ రహదారిలో ఒక వాగుపై వంతెన నిర్మాణం కూడా చేయాల్సి ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. టైర్ల కింద పడ్డ కంకర రాళ్లు ఎగిరి తగులుతుండటంతో వాహనదారులు గాయపడుతున్నారు. ద్విచక్ర వాహనాలు సైతం స్కిడ్ అయి ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. మరో వైపు దుమ్ము, ధూళితో రహదారి పక్కన ఉన్న పంటలు దెబ్బతింటున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం వల్లే నిలిచిన పనులు

ఇప్పటికి వరకు చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కావడంతో కాంట్రాక్టర్ మధ్యలో పనులను నిలిపివేశాడు. ప్రస్తుతం కొంత వరకు బిల్లులు చెల్లింపులు జరిగాయి. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

- రవికుమార్, డీఈ

ముగిసిన పోలేరమ్మ ఉత్సవాలు


పోలేరమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు... లింగరాయపాలెం సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కలిదిండి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పెదలంకలో పదకొండు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అమ్మవారిని ఊరేగించగా, మహిళలు పసుపు, కుంకుమ, టెంకాయలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం పోలేరమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. వేడి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. కైకలూరు, పెడన ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, కాగిత కృష్ణ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ సున్న రమాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

ముదినేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం - చేగూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పుట్టలో పాలుపోసి స్వామివార్లకు పూజలు జరిపారు. పలువురు పాలు, పొంగళ్ళతో తమ మొక్కులను తీర్చుకున్నారు.

అన్నసమారాధన

ముదినేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెంలోలక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సందర్భంగా దేవస్థానంలో పెద్దఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఈ సమారాధనలో సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. దేవస్థాన ఈవో పి.ఏసునాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల టీ డీపీ అధ్యక్షుడు చల్లగొళ్ళ శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకులు చలసాని జగన్మోహనరావు, పోసిన పాండురంగారావు, బి రవికుమార్, మోర్ల చలమయ్య, కొత్తూరు విఠల్, బాలాజీ పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మండవల్లి మార్చి 16(ఆంధ్రజ్యోతి): కొవ్వాడలంకలో అభయాంజనేయస్వామి 27 అడుగుల విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా ఆదివారం నిర్వహించారు. స్వామి వారికి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉండి నియోజకవర్గ పరిశీలకులు కొత్త నాగేంద్ర కుమార్, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మకు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ పూజలు



కలిదిండి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండల పరిధిలోని మూల్లంక గ్రామంలో పెద్దింట్లమ్మ అమ్మవారి జాతర వైభవంగా జరుగుతున్నది. పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయనను సత్కరించారు.

కొల్లేటికోటకు భక్తుల తాకిడి

కైకలూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం భక్తులు పాలపొంగళ్ళను అమ్మవారికి సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. జాతర ముగిసినప్పటికీ వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలిరావడంతో కొల్లేరు భక్తజనసందోహంగా మారింది. ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన చలువ పందిళ్ళలో పాలపొంగళ్ళను పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ, పిల్లలకు పాలు పంపిణీ చేశారు.



నేటి నుంచి టెన్త్ పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి


చాట్రాయిలోని ఆర్పీఎం స్కూల్ టెన్త్ పరీక్షా కేంద్రం

చాట్రాయి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చాట్రాయిలోని జడ్పీ హైస్కూల్, ఆర్పీఎం స్కూల్ పరీక్షా కేంద్రాలలో ఫర్నీచర్, లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. పరీక్షకు అరగంట ముందు పోలీస్‌స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలు తీసుకువచ్చి పరీక్ష నిర్వహిస్తారు.

కలిదిండి: కలిదిండి మండలంలో పది పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 963 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. కోరుకొల్లు జడ్పీ హైస్కూల్, కలిదిండి జడ్పీ హైస్కూల్, కలిదిండి శశి హైస్కూల్, ఆరు తెగల పాడు జడ్పీ హైస్కూల్, భాస్కరరావు పేట జడ్పీ హైస్కూల్‌లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షా సమయం ఉంటుందన్నారు. కోరుకొల్లు పరీక్షా కేంద్రాన్ని సమస్యాత్మక కేంద్రంగా గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

ముదినేపల్లి: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ముదినేపల్లి మండలంలో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే రెగ్యులర్ విద్యార్థులతో పాటు ప్రైవేటుగా పరీక్షలు రాసే విద్యార్థులకు ఏర్పాట్లు చేశారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో 193 మంది, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 191మంది, సహాయ మాతా స్కూల్లో 191 మంది, పెదగొన్నూరు హైస్కూల్‌లో 161 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాధికారి కె.నరేశ్‌కుమార్ తెలిపారు. పరీక్షల సందర్భంగా పై పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను విధించారు. కైకలూరు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ముదినేపల్లి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

మండవల్లి: మండవల్లి మండలంలోని పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో రామారావు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 300మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వివరించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర	రూ.475

యువతి అదృశ్యం

ముసునూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యువతి మిస్సింగ్‌పై శనివారం రాత్రి ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బలివే గ్రామానికి చెందిన ఓ యువతి ఈ నెల 13వ తేదీ రాత్రి భోజనం చేసి, కుటుంబ సభ్యులతో కలిసి పడుకుంది. శుక్రవారం ఉదయం లేచి చూసేరికి ఇంటిలో కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకి తెలియకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అదే గ్రామానికి చెందిన తాళ్ళ గోవర్ధన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

- ఎన్టీఆర్ వైద్యసేవ అధికారులు
- నేడు విధుల బహిష్కరణకు ఆరోగ్యమిత్రల పిలుపు

ఏలూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధనకు ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పనిచేస్తోన్న ఆరోగ్యమిత్రలు చేపట్టిన దశల వారీ ఆందోళనలో భాగంగా సోమవారం విధుల బహిష్కరణకు పిలుపుని చ్చిన నేపథ్యంలో రోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద నమోదైన 63 నెట్‌వర్క్ ఆసుపత్రులుండగా, వీటిలో 120 మంది ఆరోగ్య మిత్రలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెట్ వర్క్ ఆసుపత్రులకు రోజుకు సగటున 300 మందికిపైగా రోగులు వైద్యచికిత్సలు, సలహాల నిమిత్తం వస్తుంటారు. ఈవిధంగా ఆసుపత్రికి వచ్చే రోగిని ఔట్ పేషెంట్ కింద ప్రీ రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత వైద్య నిపుణుని వద్దకు తీసుకెళ్లి వైద్యసేవలందేలా చూడడం ఆరోగ్య మిత్రల విధి. మలి విడత ఆందోళనలో భాగ ంగా సోమవారం విధుల బహిష్కరణకు పిలుపు నివ్వడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అదనపు సీఈవో ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఓబుల్‌నాయు డు, జేఈవో రామ్‌గోపాల్ ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య మిత్రల ఆందోళనకు చేప ట్టిన ప్రత్యా మ్నాయ ఏర్పాట్లపై జూమ్ మీటింగ్ నిర్వహిం చి సూచనలు చేశారు.

బ్యాంక్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

రైలు ఢీకొని మృతి చెందాడని ప్రాథమిక నిర్ధారణ


నవీన్‌సాగర్ (ఫైల్)

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో పనిచేసే ఒక ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో రైలుపట్టాలు సమీపంలో మృతి చెందాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు, రైల్వే పోలీసులు పరిశీలించి ప్రాథమికంగా రైలు ఢీకొనడం వల్లే మరణించాడని నిర్ధారణకు వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు ఇజ్రాయిల్ పేటకు చెందిన సందోలు నవీన్‌సాగర్ (43) పెదవేగిలోని చైతన్య గోదావరి బ్యాంకులో పని చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన సత్రంపాడులో ఉంటున్నారు. ఆయనకు భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్దకుమార్తె బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. రెండో కుమార్తె ఇంటర్ చదువుతోంది. ఈనెల 15న యథావిధిగా బ్యాంక్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తూ సీఆర్ఆర్ కాలేజీ సమీపంలో బైక్‌పై పెట్టి రైలు పట్టాలపై బహిర్భూమికి వెళ్లారు. ఆ సమయంలో రైలు ఢీ కొనడంతో అతను ఎగిరి రైలు పట్టాల దిగువ భాగానికి పడిపోయారు. అతను రాత్రి అంతా రాలేదని కుటుంబ సభ్యులు, బంధువులు వెతకగా బైక్ సీఆర్ఆర్ కాలేజీ సమీపంలో కనిపించింది. దిగువ భాగాన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కోటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మరోవైపు పోలీసు జాగిలంతో పరిశీలన చేయించారు. ఈ నేపథ్యంలో అతను పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొందని నిర్ధారణకు వచ్చారు. రైల్వే ఎస్ఐ పి. సైమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఏపీపీఎస్సీ పరీక్ష ప్రశాంతం

- 134 మంది హాజరు - 166 గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో గైర్హాజరీల సంఖ్య అధికంగా ఉంది. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల పరీక్ష కేంద్రానికి 180 మంది అభ్యర్థులను కేటాయించగా 74 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 120మందిని కేటాయించగా 60 మంది హాజరయ్యారు.